క్లుప్తంగా

మధిర సీఐకి అభినందనలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఐ

మధిర: పోలీసు ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల నిర్వహణలో పాల్గొన్న మధిర సీఐ ఒడ్డేపల్లి మురళిని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ అభినందించారు. ఖమ్మం పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన ఈవెంట్లు మంగళవారం ముగియగా, సజావుగా నిర్వహించేందుకు కృషి చేసిన సీఐకి కమిషనర్ ప్రశంసాపత్రం అందజేశారు.

వననర్సరీల పరిశీలన

ముదిగొండ: మండలంలోని కమలాపురం, బాణాపురం, పెద్దమండవ గ్రామాల్లోని వననర్సరీలను బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసరావు పరిశీలించారు. వననర్సరీల్లో జరుగుతున్న పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నర్సరీల్లో పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన సూచించారు.

ఎస్సై విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

కారేపల్లి: ఎక్సైజ్ ఎస్ఐ విధులకు ఆటంకం కలిగించడమే కాక దుర్భాషలాడిన వ్యక్తిపై కారేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆబ్కారీ ఎస్సై వెంకటరమణ ఆధ్వర్యంలో సిబ్బంది మండలంలోని మేకలతండాలో బుధవారం తనిఖీలు చేపట్టగా బానోతు రవీందర్ ఇంట్లో నాటుసారా లభించింది. ఇదేక్రమంలో ఆయన పక్కింట్లో ఉండే గుగులోతు రవీందర్ చేరుకుని ఎస్సై విధులను అడ్డుకోవడమే కాక దుర్భాషలాడాడు. దీంతో ఆబ్కారీ ఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పుష్పాల రామారావు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధించిన వారిపై..

తల్లాడ: మండలంలోని పాత పినపాకలో అదనపు కట్నం కోసం వేధించిన భర్తపై కేసు నమోదైంది. పాత పినపాక గ్రామానికి చెందిన పులకాని నరేష్ తన భార్య అనితను అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాడు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని ఎస్సై సురేష్ తెలిపారు. అలాగే, పాత పినపాకకే చెందిన కేతవరపు కృష్ణకు చింతకాని మండల పందిళ్లపల్లికి చెందిన మౌనికతో 12ఏళ్ల క్రితం వివాహం జరగగా అదనపు కోసం వేధిస్తున్నాడు. దీంతో మౌనిక ఫిర్యాదు మేరకు భర్త కృష్ణతో పాటు అత్తమామలు, మరిది, ఆడబిడ్డపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్‌కు శుభాకాంక్షలు చెబుతూ ఆయన ఫొటోతో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను బుధవారం ఆ గ్రామంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ విద్యాలత, బీఆర్‌ఎస్ నాయకుడు వెంకటరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

సీపీఐ నాయకుడి మృతిపై సంతాపం

చింతకాని: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు ముల్లగిరి శ్రీను (45) గుండెపోటుతో మృతి చెందగా సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతదేహాన్ని బుధవారం సందర్శించి నివాళులర్పించారు. నాయకులు వెంకటేశ్వర్లు, దూసరి శ్రీరాములు, యేసు, మల్లికార్జున్‌రావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

కల్లూరు: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించే కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలోని 66 పాఠశాలల్లో 150 ఏజెన్సీ కార్మికులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, విజయలక్ష్మి, జ్యోతి, మాలతి, అప్సర్‌బీ, నాగూర్‌బీ, రమ్య, రమాదేవి, వెంకటరావమ్మ, దయాకర్‌రావు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

వైరా/తల్లాడ : ప్రతీ కార్యకర్త గ్రామ స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి రవీంద్రనాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం వైరాలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌ల సమావేశంలో రవీంద్రనాయక్ మాట్లాడారు. తల్లాడలో ఆపతి వెంకటరామారావు అధ్యక్షతన బీజేపీ మండల కార్యకర్తల సమావేశంలో బీజేపీ సత్తుపల్లి నియోజక వర్గ ఇన్‌చార్జీ కనగాల వెంకట్రామయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోటేశ్వరరావు, భద్రయ్య, విద్యాసాగర్ రెడ్డి, శ్యామ్ సుందర్ నాయక్, కార్తీక్, మనుబోలు వెంకటకృష్ణ, నరేష్, సతీష్, శ్రీను నాయక్, వీరాజు, బాలాజీ నాయక్, కృష్ణారావు, శ్రీనివాస్, మధు, శారద, తిరుమలయ్య, భాస్కర్, నాగేశ్వరరావు, వెంకటరామయ్య పాల్గొన్నారు.

నిధులు సరే.. నిర్మాణమేది?

- శిథిలమైన బనిగండ్లపాడు పీహెచ్‌సీ
- నూతన భవనానికి రూ.1.5 కోట్లు మంజూరు
- పూర్తయిన టెండర్ ప్రక్రియ..
- శంకుస్థాపన నిమిత్తం అమాత్యుల కోసం ఎదురుచూపులు



శ్లాబు పెచ్చులూడిన దృశ్యం



బనిగండ్లపాడులో శిథిలమైన పీహెచ్‌సీ భవనం

ఎర్రుపాలెం: బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాలు పూర్తిగా శిథిలమై దశాబ్దాలు గడుస్తున్నాయి. దీంతో పలు మార్లు జిల్లా కలెక్టర్‌కు, స్థానిక ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్, మంత్రులకు ప్రజలు సమస్యను వివరించి వినతులు అందించారు. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి గత ఐదు నెలల క్రితం రూ.1.5 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ సైతం పూర్తైంది. భీమవరం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ వెంకట కృష్ణారావు టెండర్ దక్కించుకున్నారు. డిసెంబర్ నెలలోనే పనులకు జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కలు శంకుస్థాపన చేయాల్సివుంది. నిధులొచ్చి నెలలు గడుస్తున్నాయి. టెండర్ ఖరారైనప్పటికీ నిర్మాణపనులకు శంకుస్థాపన చేయాల్సిన అమాత్యుల కోసం ఎదురుచూపులు చూడాల్సివస్తుంది. ప్రస్తుతం శిథిలమైన భవనంలోనే సిబ్బంది భయంగుప్పిట్లో పెట్టుకొని వైద్య సేవలు అందిస్తున్నారు. అటు సిబ్బంది, ఇటు రోగులు ఆస్పత్రి తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భయంతో సిబ్బంది విధులు



పీహెచ్‌సీలోని చాలా రూంల్లో శ్లాబు పెచ్చులూడి కిందపడుతున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు తెలపడంతో నూతన భవన నిర్మాణం కోసం నిధులు వచ్చాయి. త్వరితగతిన నిర్మాణపు పనులు ప్రారంభిస్తే బాగుంటుంది.

– జి.రాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి, బనిగండ్లపాడు

నిధుల కోసం కృషి చేశాం..



ఆస్పత్రి భవనం దుస్థితి విషయాన్ని స్టాండింగ్‌కౌన్సిల్ సమావేశాల్లో కలెక్టర్ దృష్టికి తెచ్చాం. జిల్లా మంత్రి, వైద్య శాఖామంత్రి, జెడ్పీ చైర్మన్లకు సమస్య వివరించడం జరిగింది. దీంతో ప్రభుత్వం రూ.1.5 కోట్లు నిధులు మంజూరు చేయడం చాలా సంతోషం. అధికారులు నిర్మాణపు పనులు ప్రారంభించాలి.

– శీలం కవిత, జెడ్పీటీసీ, వైద్య విభాగం స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు

త్వరలోనే పనులు చేపడతాం..



పీహెచ్‌సీ భవన పూర్తిగా శిథిలమైన విషయం వాస్తవమే.. నూతన భవన నిర్మాణపు పనుల నిమిత్తం శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పనుల నిర్వహణకు గానూ టెండర్ ఖరారైంది. ఆస్పత్రి ఆవరణలోనే ఖాళీ ప్రదేశంలో వీలైనంత వరకు త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం.

– ఏతఈ, పీఆర్, ఎర్రుపాలెం

అతివేగంతో వాహనాలు నడపొద్దు



అవగాహన కల్పిస్తున్న సత్తుపల్లి రూరల్ సీఐ హనోక్

పెనుబల్లి: రోడ్లపై అతివేగంతో వాహనాలు నడపకూడదని సత్తుపల్లి రూరల్ సీఐ సీహెచ్ హనోక్ తెలిపారు. బుధవారం వియంబంజర్ రింగ్ సెంటర్‌లో ద్విచక్రవాహన దారులకు, స్థానికులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నింబంధనలు పాటించాలని, అతివేగానికి పోయి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ఇటీవల కాలంలో కొందరు యువకులు హైస్పీడ్ మోటారు బైకలతో అతివేగంగా గ్రామాల్లో తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారని, వారిని పోలీసు వారు గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహిస్తారన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఉపాధ్యాయులకు దిక్సూచి యూటీఎఫ్ డైరీ



మధిర: మాట్లాడుతున్న షేక్ నాగూర్ వలి

మధిర: ఉపాధ్యాయ, ఉద్యోగులకు టీఎస్ యూటీఎఫ్ డైరీ దిక్సూచి వంటిదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్‌వలి తెలిపారు. స్థానిక యూనియన్ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం వినోదరావు అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన యూనియన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని కోరారు. జీఓ నంబర్ 317 అప్పీల్స్ అన్నింటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ నెల 13,14న హైద్రాబాద్‌లో జరగనున్న యూటీఎఫ్ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యూనియన్ 2023 సంవత్సరం డైరీ, క్యాలెండర్, అధ్యాపక దర్శిని, స్టిక్కర్ క్యాలెండర్లను ఎంఈఓ వై.ప్రభాకర్, ఎస్‌బీఐ సిరిపురం బ్రాంచ్ మేనేజర్ వీరాస్వామి, యూనియన్ జిల్లా పూర్వ కార్యదర్శి ఆంజనేయులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీరయ్య, లాల్ అహ్మద్, జీబీఎంఎస్ రాణి, భాస్కరరావు, సాధు సమాధానం, కొండలరావు, రాజు, చెన్నయ్య, మీరాఖాన్, ఆశీర్వాదం, పీవీ రమణ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ..

బోనకల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ నూతన క్యాలెండర్‌ను బుధవారం ఎంఈఓ ప్రభాకర్,ఎండీఓ వేణుమాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాద్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చలపతిరావు, రత్నకుమారి, హరిప్రసాద్, వల్లంకొండ రాంబాబు, చంద్రప్రసాద్, గోపాల్‌రావు, పుల్లారావు పాల్గొన్నారు.

సామాజిక న్యాయమే ఎమ్మెస్పీ లక్ష్యం



తల్లాడ: ఎమ్మెస్పీ జెండా ఎగుర వేస్తున్న వెంకటేశ్వరరావు

తల్లాడ/ సత్తుపల్లిరూరల్/ కల్లూరు: సామాజిక న్యాయమే ఎమ్మెస్పీ లక్ష్యమని ఎమ్మెస్పీ జిల్లా కోఆర్డినేటర్, ఎమ్మెస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలికపోగు వెంకటేశ్వరరావు మాదిగ, ఎమ్మెస్పీ ఇన్‌చార్జీ నాయకులు తెలిపారు. బుధవారం తల్లాడలోని స్థానిక రింగ్ సెంటర్‌లో, సత్తుపల్లిలోని స్థానిక జేవీఆర్ డిగ్రీ కళాశాల వద్ద, కల్లూరు మండలంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెస్పీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక సమానత్వమే మహాజన సోషలిస్ట్ పార్టీ లక్ష్యంమన్నారు. ఈ పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను కలుపుకొని రాజ్యాధికారం సాధించడానికి మందాకృష్ణమాదిగతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెస్పీ నాయకులు దారెల్లి వెంకటేశ్వరరావు, కొండా ముదిరాజ్, కోట బలరాం మాదిగ, నాగు, తిరుమలరావు, జయరాజ్, ప్రసాద్, కృష్ణ, వెంకటి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, గొల్లమండల ముత్తారావు, లక్ష్మణ్, రాంబాబు, దేవదాసు, అశోక్, దేవయ్య, అర్జున్, ఎమ్మెస్పీ ఇన్‌చార్జ్ నాయకులు కోటేశ్వరరావు, వేణు, వెంకటేశ్వర్లు, రాము, పుల్లారావు, కృష్ణ, లక్ష్మణ్, వెంకటి, ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి



భవిత కేంద్రంలో బిందుకు సహాయ పరికరాన్ని అందిస్తున్న ఎంఈఓ శ్యాంసన్

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మండల విద్యాశాఖాధికారి మోదుగు శ్యాంసన్ తెలిపారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పాక్షిక అంగవైకల్యం కల్గిన పిల్లలకు ఉచితంగా ప్రత్యేకంగా ఫిజియోథెరపీ సేవలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సేవలతో పిల్లల్లో శారీరక, మానసిక పరిపక్వత కనబడుతుందన్నారు. ఈ సందర్భంగా నాగులవంచ గ్రామానికి చెందిన తుపాకుల బిందు అను బాలికకు రాయడానికి ఉపయోగపడే సహాయ పరికరాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హనుమంతురావు, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సూర్యకుమారి, కుమారస్వామి, ఫిజియోథెరపీ వైద్యురాలు వసంత, ఐఈఆర్పీలు కృష్ణారావు, దస్లీ, సీఆర్పీ తిరపయ్య, భవిత కేంద్రం సంరక్షురాలు లలితకుమారి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మండలస్థాయి టీఎల్ఎం మేళా



సత్తుపల్లి: ప్రశంసాపత్రాలు, బహుమతులు అందుకున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు



బోనకల్: రావినూతలలో టీఎల్ఎం బోధనోపకరణాలను పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రభాకర్

జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాకు సత్తుపల్లి పీఎస్ ఎంపిక..

సత్తుపల్లి: మండల స్థాయిలో నిర్వహించిన టీఎల్ఎం మేళాలో బహుమతులు సాధించి జిల్లా స్థాయిలో నిర్వహించే టీఎల్ఎం మేళాకు సత్తుపల్లి పాత సెంటర్ ప్రాథమిక పాఠశాల ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు పి.పవన్ పరిసరాల విజ్ఞానం విభాగంలో, పంతంగి నర్సింహారావు ఆంగ్లమాధ్యమ విభాగంలో, తోటచర్ల జయశ్రీ గణిత విభాగంలో ప్రదర్శన బోధన అభ్యాసన సామగ్రి బహుమతులు గెలుచుకొని జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. వీరిని ఎంఈఓ బి.రాములు, విద్యానోడల్ అధికారి ఎస్.రాజేశ్వరరావు, సహకరించిన హెచ్ఎం చిత్తలూరి ప్రసాద్‌ను అభినందించారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి టీఎల్ఎం(బోధనోపకరణాల ప్రదర్శన) మేళా కార్యక్రమం జరిగింది. ఈ మేళాను ఎంపీపీ దేవరకొండ శిరీష, సర్పంచ్ మొగిలి అప్పారావులు స్థానిక హెచ్ఎం మురళీమోహన్‌రావుతో కలిసి ప్రారంభించారు. పాఠశాల ఏఎంఓ రవికుమార్, ఎంఈఓ వై.ప్రభాకర్‌తో కలిసి బోధనోపకరణాల ప్రదర్శన స్టాల్స్‌ను తిలకించారు. బెస్ట్ బోధనోపకరణాలను స్టాల్స్‌లో ప్రదర్శించిన పలువురి ఉపాధ్యాయులను వారు అభినందించారు. మేళాకు సహకరించిన దాతలు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ షేక్ మస్తాన్ వలీ, పలు పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

గోపవరం పాఠశాలకు 3 బహుమతులు..

కొణిజర్ల: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన తొలిమెట్టు మండల స్థాయి టీఎల్ఎం మేళాలో గోపవరం ప్రాథమికోన్నత పాఠశాల మూడు విభాగాలలో జిల్లా స్థాయికి ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్ఎం షేక్ లాల్‌సయ్యద్ తెలిపారు. తెలుగు, ఆంగ్లం, గణిత విభాగాలలో మండల స్థాయిలో బహుమతులు గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ మేళాలో పాఠశాల ఉపాధ్యాయినిలు శైలజ, నాగమణి, రమాదేవి, విజయలక్ష్మి సహకరించినట్లు తెలిపారు.

భావిభారత పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..

బోనకల్: భావిభారత పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్ అన్నారు. మండలంలోని రావినూతల ఉన్నత పాఠశాలలో టీఎల్ఎం కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. టీఎల్ఎం మేళాలో బోధనోపకరణాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు చలపతిరావు, రవికుమార్, చింతల వెంకటేశ్వరరావు తదితరులున్నారు

గురువులు సమాజానికి మార్గదర్శకులు..

ఏన్కూరు: సమాజాన్ని తీర్చిదిది ఉపాధ్యాయులేనని ఎంపీడీఓ బయ్యారపు అశోక్ అన్నారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టీఎల్ఎం మేళ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ మేళలో పాఠశాలల వారు తయారు చేసినటువంటి బోధనోపకరణములను ప్రదర్శించారు. వీటిలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి దుగ్గిరాల జయరాజ్, ప్రధానోపాధ్యాయురాలు శైలా పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఆధార్ కేంద్రం ప్రారంభం

వైరా: వైరా మున్సిపాలిటీలోని బస్టాండ్ సమీపంలో గల సాయిగణేష్ మొబైల్స్ దుకాణంలో బీఎస్ఎన్ఎల్ ఆధార్ కేంద్రాన్ని బీఎస్ఎన్ఎల్ ఏజీఎం గోవిందు, ఈఈ కె.రామ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో బస్టాండ్ వద్ద ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు,. ఆధార్ అప్‌డేట్‌కు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.ప్రసాదరావు, టి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు

గ్యాస్ టెస్టింగ్ సర్టిఫికెట్ పొందిన విద్యార్థులు

సత్తుపల్లిరూరల్: స్థానిక మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో మైనింగ్ ఇంజనీరింగ్ విభాగంలో 4వ సంవత్సరం చదువుతున్న 22 మంది విద్యార్థులకు ఐఐటీ ధన్‌బాద్, జార్ఖండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యాస్ టెస్టింగ్ పరీక్షలకు అర్హత సాధించి సర్టిఫికేషన్ పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ హరికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ హరికృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్‌లు అభినందించారు.

రేవంత్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

తల్లాడ: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ధర్నాచౌక్ వద్దకు వెళ్లికుండా అరెస్ట్ చేయడం అప్రజాస్వామిక చర్య అని తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుదాకర్, మండల నాయకుడు రఘుపతిరెడ్డి అన్నారు. తల్లాడలో వారు రేవంత్ రెడ్డి అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను దారి మళ్లించి బీఆర్ఎస్ పార్టీ ఖర్చులకు వాడుకోవటంపై రేవంత్‌రెడ్డి లేవదీసిన విషయాన్ని జీర్ణించుకోలేక అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్వర్లు(కేవీ) పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

సత్తుపల్లి: సత్తుపల్లి విద్యాలయం, శ్రీచైతన్య టెక్నో కరికులం నవంబర్‌లో జరిగిన ఇండియన్ నేషనల్ టాలెంట్‌సెర్చ్ ఒలంపియాడ్(ఐఎన్‌టీఎస్ఓ) పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కే ఫరీద్ అభినందించారు. 6వ తర గతి నుంచి 12 మంది, 7వ తరగతి నుంచి 21 మంది, 8వ తరగతి నుంచి 15 మంది, 9వ తరగతి నుంచి 18 మంది, 10వ తరగతి ఐదుగురు మొత్తం 71 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.అజిత, ఎన్‌డీఎస్ శివకృష్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతి పోస్టర్లు ఆవిష్కరణ

వైరా: ఎన్టీఆర్ కళా పరిషత్ వైరా వారి ఆధ్వర్యంలో ఈ నెల 18న ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను స్థానిక ఇండోర్ స్టేడియంలో బుధవారం కళాపరిషత్ సభ్యులు కట్టా కృష్ణార్జునరావు, కాపా మురళీ కృష్ణ, పాదిల హరినాద్, ఏదునూరి శ్రీను, కర్నాటి హనుమంతరావు, సూర్యదేవర శ్రీధర్, చెరుకూరి కిరణ్, గింజపల్లి జనార్ధన్, శ్రీనివాసరావు, అంజి నాగేశ్వరరావు ఆవిష్కరించారు.

తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు



వైరా: మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా కాంటా వేసిన ధాన్యం రాశులను తక్షణమే ఎగుమతి చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు హరి, వెంకటేశ్వరరావు, సుంకర సుధాకర్, నాగేశ్వరరావు, సైదులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లులకు ధాన్యాన్ని తరలించాలి..

కారేపల్లి: కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించి రైతులు నష్టపోకుండా చూడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దుగ్గి కృష్ణ అన్నారు. బుధవారం కారేపల్లి మండలం విశ్వనాథపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 6లారీల ధాన్యం కేంద్రంలో నిల్వ ఉందని, తక్షణమే ధాన్యాన్ని లారీల్లో తరలించి రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో విశ్వనాథపల్లి ఎంపీటీసీ సభ్యుడు వడ్డె అజయ్‌బాబు, నాయకులు సోందు, సైదులు, శ్రీను, భంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల జీవితాలతో చెలగాటమాడొద్దు



మాట్లాడుతున్న నంబూరి రామలింగేశ్వరరావు

కల్లూరు: సర్పంచ్‌ల జీవితాలతో టీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు విమర్శించారు. బుధవారం కల్లూరులో పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని నంబూరి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సర్పంచ్‌ల ఖాతాలలోకి నేరుగా నిధులు జమ చేస్తుందని, కాని జమ చేసిన కొన్ని గంటలలోనే తెలంగాణ ప్రభుత్వం సర్పంచ్‌ల ఖాతాలను ఖాళీ చేస్తుందని ఆరోపించారు. ఈ నెల 7న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తెలంగాణలోని అన్ని పోలింగ్ బూత్ అధ్యక్షులతో పాటు పోలింగ్ బూత్ స్థాయి సభ్యులతో వర్చువల్‌గా మాట్లాడనున్నారని, దీనికి సంబంధించిన సమావేశం కల్లూరులో జరుగుతుందన్నారు. ఈ సమావేశాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, నియోజకవర్గ కన్వీనర్ వీరంరాజు, కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, గుండపనేని అనీల్, నరసింహారావు, చిన్ని కృష్ణ, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, విష్ణుకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు వెల్లువ

తల్లాడ: మండలంలోని పాత మిట్టపల్లి గ్రామంలో పునర్ నిర్మాణం చేపట్టిన మల్లిఖార్జున స్వామి ఆలయానికి బుధవారం విరాళాలు వెల్లువలా వచ్చాయి. పాత మిట్టపల్లికి చెందిన పోట్రు పెద్ద దర్గయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. పోట్రు శ్రీనివాసరావు, సురేష్‌లు రూ.50 వేలు, పోట్రు రామారావు, పద్మావతి దంపతులు రూ.30 వేలు, దారా మణికుమార్, లక్ష్మణ్ కుమార్ రూ.50 వేలు విరాళాలను అందించారు. మల్లిఖార్జున స్వామి ఆలయ కమిటీ సభ్యులకు విరాళాలను నగదు రూపంలో వారు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే కార్మికులపై పెరిగిన పనిభారం

కారేపల్లి: రైల్వే కార్మికులపై పనిభారం పెరిగిందని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డోర్నకల్ సెక్షన్ అసిస్టెంట్ సెక్రటరీ భూక్యా బాలాజీ అన్నారు. బుధవారం కారేపల్లి రైల్వే స్టేషన్ జంక్షన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియర్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్, పాకెట్ డైరీలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, దేవ్‌సింగ్, చిన్నా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రగ్గులు పంపిణీ

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లోని 240 మంది విద్యార్థులకు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నుంచి సరఫరా చేసిన ఉలెన్ రగ్గులను కౌన్సిలర్ రాఘవేందర్ చేతుల మీదుగా బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ సంక్షేమాధికారి బి.రాములు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు..

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని సుదర్శన్ ఫౌండేషన్ చర్చిలో ఫాదర్ జగదీష్ పాల్ బుధవారం గ్రామంలోని పలువురు వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ వసంత్‌రాయ్, బాణాల శ్రీనివాసరావు, రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

డే కేర్ సెంటర్‌లో..

వైరారూరల్: మండలంలోని పాలడుగు, గొల్లెనపాడు గ్రామాల్లో గల జీఎస్ఎస్ డే కేర్ సెంటర్‌లోని సుమారు 160 మంది నిరుపేద విద్యార్థులకు బుధవారం గ్రేస్ సొసైటీ సర్వీస్ ఆధ్వర్యంలో దుస్తులు, బొమ్మలు తదితర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి గరికపాటి కుమార్, చైల్డ్ కేర్ సెంటర్ ఇన్‌చార్జ్ మోదుగు వినోద్‌కుమార్, సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణారెడ్డి, సైదులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న ఎంఈఓ శ్యాంసన్

చింతకాని: మండలంలోని లచ్చగూడెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థినులకు కవికొండల కనకరాజు, పరమేశ్వరీ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు అందజేసిన పరీక్ష ప్యాడ్లను బుధవారం మండల విద్యాశాఖాధికారి మోదుగు శ్యాంసన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ప్యాడ్లను అందజేసిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హనుమంతురావు, కేజీబీవీ ఇన్‌చార్జ్ ఎస్ఓ మంజుల, ఐఈఆర్పీ కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, తదితరులు పాల్గొన్నారు.